# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 21-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశానికి హాని కలిగించే అంశాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సూచించారు.
- ❖ రెండు రోజుల పర్యటన నిమిత్తం కువైట్ చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం లభించింది.
- ❖ ఈశాన్య రాష్ట్రాలు.. గడచిన దశాబ్ద కాలంలో గణనీయమైన అభివృద్ధిని సాధించాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ జీఎస్టీ 55వ కౌన్సిల్ సమావేశం ఈరోజు జైసల్మేర్ లో జరిగింది.
- ❖ మొట్టమొదటి ప్రపంచ ధ్యాన దినోత్సవం న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ఈరోజు నిర్వహించారు.

==============================

దేశానికి హాని కలిగించే అంశాల పట్ల యువత అప్రమత్తంగా వ్యవహరించాలని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్ ఖడ్ పేర్కొన్నారు. చండీగఢ్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయంలో ఈరోజు జరిగిన 5వ పూర్వవిద్యార్థుల సమ్మేళనం-2024 మొదటి దశ కార్యక్రమానికి ఎక్స్ అఫీషియో ఛాన్సలర్ హోదాలో ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పంజాబ్ యూనివర్శిటీ పూర్వ విద్యార్థులు దేశంలోని అత్యున్నత పదవులను అలంకరించారని అన్నారు. అలాగే.... కళలు, క్రీడలు మొదలైన వాటిలో సైతం రాణించారని పేర్కొన్నారు. మన పురోగతికి అవరోధం కలిగించే ఆలోచనలు ఉన్నవారితో జాగ్రత్తగా మెలగాలని సూచించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఉప రాష్ట్రపతి ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు పిలుపునిచ్చారు.

==============================

రెండు రోజుల పర్యటన నిమిత్తం కువైట్ చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ మొదటి ఉప ప్రధాన మంత్రి షేక్ ఫహద్ యూసఫ్ సౌద్ అల్-సబాహ్, పలువురు మంత్రులు, ప్రముఖులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. కువైట్ నగరంలో ప్రధానమంత్రి... 101 సంవత్సరాల మాజీ ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి మంగళ్ సైన్ హండాతోను, రామాయణ, మహాభారత గ్రంథాలను అరబిక్‌లోకి అనువదించిన అబ్దుల్లా అల్ బరూన్ తోను సమావేశమయ్యారు.

కాగా... కువైట్ ప్రయాణం సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... కువైట్‌తో సంబంధాలను భారత్ ఎల్లప్పుడూ గౌరవిస్తుందన్నారు. రెండు దేశాలు బలమైన వాణిజ్య, ఇంధన భాగస్వాములు మాత్రమే కాదని, పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, భద్రత, సుస్థిరత, శ్రేయస్సులపై ఇరుదేశాలు ఆసక్తిగా ఉన్నాయని అన్నారు. ఇరుదేశాల ప్రయోజనం లక్ష్యంగా ఒక ప్రణాళికను రూపొందించడానికి ఇది ఒక అవకాశమని పేర్కొన్నారు. తన పర్యటన ఇరు దేశాల ప్రజల మధ్య స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రధానమంత్రి ఆశాభావం వ్య క్తం చేశారు.

============================

గడచిన దశాబ్ద కాలంలో ఈశాన్య రాష్ట్రాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు త్రిపురలోని అగర్తలాలో జరిగిన ఈశాన్య మండలి 72వ ప్లీనరీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈశాన్య ప్రాంతంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందాయని, తద్వారా ఢిల్లీకి ఈ ప్రాంతం చేరువయ్యిందని అన్నారు. 200కు పైగా ఇక్కడి గిరిజన సమూహాలు తమ సాంస్కృతిక వైవిధ్యం కారణంగా ప్రపంచం మొత్తానికి ఆకర్షణ కేంద్రాలుగా మారాయని అన్నారు. ఈశాన్య ప్రాంతంలో వివిధ రకాల వన్యప్రాణులు, జలవనరులతో పాటు 7 వేల 500 పుష్పజాతులు ఉన్నాయని, ఈ సహజ వైవిధ్యాల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం గత 10 సంవత్సరాలుగా గణనీయమైన కృషి చేసిందని హోంమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

============================

వస్తు సేవల పన్ను (GST) 55వ కౌన్సిల్ సమావేశం ఈరోజు జైసల్మేర్ లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగింది. సమావేశం వివరాలను ఆర్థిక మంత్రి పత్రికా ప్రతినిధులకు తెలియజేశారు. జన్యు చికిత్సలకు జీఎస్టీ మినహాయింపు, రుణ గ్రహీతలపై బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు వేసే జరిమానాలపై జీఎస్టీ తొలగింపు, ఫోర్టిఫైడ్ బియ్యం గింజలపై జీఎస్టీ 5 శాతానికి తగ్గింపు నేటి సమావేశంలో ముఖ్య నిర్ణయాలని ఆమె పేర్కొన్నారు. జీవిత బీమా, ఆరోగ్య బీమాపై జీఎస్టీ మినహాయింపునకు సంబంధించి మరికొంత సమాచారం రావలసి ఉండడంతో ఆ అంశాన్ని వాయిదా వేస్తున్నామని ఆమె పేర్కొంటూ....

(వాయిస్ 37 సెకన్లు)

విరామం

============================

ప్రపంచ దేశాల మధ్య శాంతి, శ్రేయస్సులను నెలకొల్పడంలో భాగంగా తీసుకొన్న చర్యలను సూచిస్తూ.. మొట్టమొదటి “ప్రపంచ ధ్యాన దినోత్సవా”న్ని ఈరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్య సమితిలోని భారత శాశ్వత మిషన్ ఈ రోజు న్యూయార్క్ లోని ప్రధాన కార్యాలయంలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఐక్యరాజ్య సమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఆతిథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ నేతృత్వంలో గ్లోబల్ మెడిటేషన్ సెషన్ నిర్వహించారు. ఆరోగ్యం, శ్రేయస్సులకు యోగా ఇంకా ధ్యానం పరిపూర్ణ విధానాలుగా గుర్తిస్తూ... ఐక్యరాజ్య సమితి సాధారణ అసెంబ్లీ తీర్మానం చేసిందని హరీశ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==============================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)... యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ESA)తో ఒప్పందం కుదుర్చుకుంది. మానవ సహిత అంతరిక్ష యాత్రలను పెంపొందించడం లక్ష్యంగా ఇస్రో... ఈరోజు ఒప్పందం చేసుకొంది. రానున్న యాక్సియోమ్ - 4 మిషన్ కు సంబంధించి వ్యోమగామి శిక్షణ, మిషన్ అమలు, పరిశోధనా ప్రయోగాలపై పరస్పరం సహకరించుకోవడం ISRO, ESA ల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా ఉన్నాయి. ఈ ఒప్పందంపై ఇస్రో చైర్మన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి డాక్టర్ ఎస్ సోమనాథ్, ఈఎస్ఏ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జోసెఫ్ అష్బాచర్ లు సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్య ఒప్పందం... భారతదేశ మానవ సహిత అంతరిక్ష ప్రయాణ సామర్థ్యాలను, ప్రపంచ సహకారాన్ని ముందుకు తీసుకువెళుతుందని ISRO సామాజిక మాధ్యమం వేదికగా తెలియజేసింది.

==============================

భారత్‌లో అడవుల విస్తీర్ణం 2021 సంవత్సరం అంచనాలతో పోలిస్తే ఒక వెయ్యి 445 కిలోమీటర్ల మేర పెరిగిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ద్వైవార్షికంగా ప్రచురించిన ఈ నివేదిక... దేశంలోని అటవీ, వృక్ష వనరుల సమగ్ర అంచనాను తెలియజేస్తుంది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ లో "ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ 2023"ను విడుదల చేశారు. దీని ప్రకారం భారత్‌లో అడవులు, 8 లక్షల 27 వేల 357 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయని తెలిపింది. ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో 25.1 శాతమని నివేదిక పేర్కొంది.

==============================
==============================